# ముసుగు




"రైలింకా ఎంచేపట్లో కదుల్తుంది?" అన్నాడు బాబు చిరాకు ప్రదర్శిస్తూ.

"బయల్దేరుతుంది!" అన్నాడు సారథి ఆవలిస్తూ.

కడుపు నిండా తిని రైలెక్కడం వలన బాగా నిద్ర వస్తున్నది. బయట ఎండ తీవ్రంగా ఉంది. మూర్తి ట్రెయినెక్కగానే పై బెర్త్ మీద నడుం వాల్చాడు. అసలు ఈసరికే మంచి నిద్రలో ఉండి ఉంటాడు.

"అదే, ఎప్పాలు బయల్దేలుతుంది?" అన్నాడు బాబు మళ్లీ.

అమాయికంగా వున్న ఆ పసిముఖం చూస్తే సరదా వేసింది సారథికి. సుతిమెత్తంగా బుగ్గ పిండి, చెక్కిలి మీద ముద్దు పెట్టుకున్నాడు.

"జాగ్రత్తరా, నానీ, నువ్వు కిటికీ దగ్గర కూర్చోకు. కళ్లలో నలుసులు పడతయ్!" వీణ మీటినట్టు ఉంది కంఠస్వరం.

సారథి తల ఎత్తి చూశాడు. అంతే! తల వంచుకున్నాడు. చేతిలో ఉన్న పేపరుని ముఖానికి అడ్డంగా పెట్టుకొని చదువుతున్నట్టు కూర్చున్నాడు.

ఆమె సారథిని గమనించలేదు. కూలీ సామానులు తెచ్చి సీటు కింద పెట్టి ఆమె దగ్గిర డబ్బులు తీసుకొని వెళ్ళి పోయాడు.

" అమ్మా! నేను కిటికీ దగ్గిర కూర్చుంటానే!" అంటున్నాడు నానీ.

"వద్దురా, వెధవా, చేతులూ అవీ బయటపెడతావ్". మందలించి తను కిటికీ దగ్గిర సారథికి ఎదురుగా కూర్చుని పసిదాన్ని ఒళ్లో కుదేసుకున్నది. నానీ ఆమె పక్కనే కూర్చుని బిక్కముఖంతో దిక్కులు చూస్తున్నాడు.

కంపార్టుమెంటు దాదాపుగా ఖాళీగానే ఉంది.

సారథికి ఆమెను ఎక్కడో చూసినట్టయింది. మరుక్షణంలోనే ఆమె ఎవరో, ఎక్కడ తను చూశాడో గుర్తుకు వచ్చింది. ఏదో అపరాధం చేసినవాడిలా బాధపడిపోయాడు. ఆమె.... ఆమె పేరు..... సావిత్రి. అవును. సావిత్రే! ఆమె తనని గుర్తుపట్టలేదు.

ఆమెని మళ్లీ ఒకసారి చూడాలనిపించింది సారథికి. చేతిలోని పేపరు కొద్దిగా వంచి, ఒక పక్కనించి చూశాడు.

ఆమె ఒడిలోని పసిపిల్లకి పాలు ఇస్తున్నది. పమిటె నిండుగా కప్పుకున్నది. ఈ అయిదారేళ్ళలోనూ చాలా పెద్దదయిపోయినట్లు కనిపిస్తున్నది. మనిషి అదివరకటి కన్నా ఎర్రబడింది. చక్కటి ఆమె ముఖంలో నుదిటి మీద గుండ్రటి కుంకుమ బొట్టు వింతగా మెరుస్తున్నది. మెడలోని నల్లపూసలు, మంగళసూత్రాలు ఆమెకు అదోరకమైన గాంభీర్యాన్ని, వింత సోయగాన్ని తెచ్చిపెడుతున్నాయి!

ఆమె అతనివేపు హఠాత్తుగా చూసింది. సారథి చటుక్కున పేపరు అడ్డంగా ఉంచాడు, తప్పు చేసిన వాడిలా. అయినా దొరికిపోయాడు. ఆమె చూసిన చూపులో ఆ రోజుకీ, ఈ రోజుకీ చాలా తేడా ఉంది. ఆనాడు ఆమె చూసిన చూపులో చిలిపితనం ఉంది; సిగ్గు ఉంది; అందం ఉంది; ఆవేశం ఉంది; ఏదో అర్థం ఉంది. కానీ ఈనాడు ఏదో గాంభీర్యం ఉంది. ప్రౌఢత్వం ఉంది; మందలింపు ఉంది; చిన్నపిల్లవాడిని చూసే తల్లి చూపులా ఉంది.

అయితే సావిత్రికి అప్పుడే ఇద్దరు పిల్లలన్నమాట! భర్త ఏం చేస్తున్నాడో? తనకన్నా ఎక్కువ చదువుకున్నవాడా? అందగాడా? ఆస్తిపరుడా?

"అరేయ్, సారథీ! బెజవాడ ఇంకా రాలేదా!" అన్నాడు మూర్తి, పై బెర్త్ మీదనించి ఆవలిస్తూ.

"ఇంకా గుంటూరులో బయలుదేరలేదురా, నాగన్నా, అప్పుడే బెజవాడ ఎక్కడ వస్తుంది!" అన్నాడు సారథి మూర్తికి జవాబుగా.

మూర్తి ముడుచుకు పడుకున్నాడు.

"అబ్బ, ఎంచేపూ!" అన్నాడు బాబు.

"అరె! ఉండరా బయలుదేరుతుంది, తొందరేం!" అంటూ బాబు భుజం మీద చేయి వేసి చిన్నగా ఊపాడు సారథి. ఎందుకో బాబు అంటే సారథికి తగని ముద్దు.

ఈ గొడవలో ఆమె తనని తీక్షణంగా గమనిస్తున్నట్టు సారథి గమనించలేదు.

ఆమెకీ సారథి పూర్వపరిచితుడులాగానే కనపడ్డాడు. ఒక్క క్షణంలో గుర్తు పట్టగలిగింది కూడాను. అవును, మరి! సారథిని అంత తొందరగా మరిచిపోతుందా?

"మిమ్మల్నెక్కడో చూశాను!" అన్నది ఆమె పిల్లని ఒళ్లో కూర్చోబెట్టుకుని, పమిటె చెంగుని నిండా కప్పుకున్న తరువాత.

సారథి ఉలిక్కి పడ్డాడు! ముందు తనని కాదేమో అనుకున్నాడు.

ఆమె మళ్లీ అదే అన్నది!

సారథి ఆమెకేసి చూశాడు. చిరునవ్వు పెదాల మధ్య నొక్కిపట్టి అడుగుతున్నదామె.

"అవును! నేనూ మిమ్మల్నింతకుముందు చూశాను!" అన్నాడు గొంతు పెగల్చుకొని.

"ఎక్కడ చూశారో గుర్తున్నదా!" వెటకారం చేసినట్టుగా అన్నదామె.

"ఆఁ!" అంటూనే, పేపరు తీసి ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు సారథి.

ఆమె ఏదో అనబోయి, సారథిని చూసి, ఊరుకుంది.

ట్రెయిన్ మెల్లగా బయలుదేరింది. కంపార్టుమెంటులో ఒక పక్కన నిద్రకి తూగుతున్న ముసలాయన తప్ప మరెవరూ లేరు!

సారథికి ఏమిటోగా ఉంది! ఆమె తనని బాగా గుర్తు పట్టింది! తనను అంత తొందరగా మరిచిపోతుందా? కొంపతీసి తనను అసహ్యించుకోవడంలేదు కదా! తనమీద తనకే అసహ్యం వేస్తున్నది.

ఆమెను మొదటిసారిగా వాళ్ల ఇంట్లోనే చూశాడు, పెళ్ళి చూపులకని వెళ్ళి, ఆమె ముగ్ధమోహన స్వరూపం, మృదుల మంజుల గానం తనని సమ్మోహితుణ్ణి చేశాయి. వెంటనే ఆమెను పెళ్లాడటానికి ఒప్పుకున్నాడు. తండ్రి అన్ని మాటలూ మాట్లాడుకువచ్చాడు. ముహూర్తం కూడా త్వరలోనే పెట్టుకుందామనుకున్నారు. ఎన్నో సంబంధాలు చూసి, చూసి, విసుగు పుట్టి, వేసారి పోయిన తనకీ ఎంతో సంతోషమయింది. కాని... ఇంతలోనే తన తండ్రి ముందు ఎవరో ఊదారు. వాళ్లు ఇంకా ఎక్కువ తాహతు కలవారేననీ, ఇంకో పది వేలు ఎక్కువ కట్నం ఏ

బాధాలేకుండా ఇవ్వగల స్తోమతు కలవారేననీ, వాళ్ల పిల్లని అంత చౌకగా చేసుకోవటమేమిటని ప్రశ్నించారు కొందరు పెద్దలు. దానితో తన తండ్రి ఇంకో పది వేలు ఎక్కువ కావాలన్నాడు. ముందుగానే అడిగితే ఇచ్చేవాళ్ళమేననీ, అంతా ఒప్పుకుని ఇప్పుడు కాదనటం మర్యాదస్థుల లక్షణం కాదనీ వాళ్లు అన్నారు. మాటా మాటా వచ్చింది. తన తండ్రి ఆ సంబంధం వదులుకున్నాడు. తరువాత తను ఎన్నో సంబంధాలు చూశాడు. కొందరు పిల్లలు నచ్చలేదు. నచ్చితే, జాతకాలు కుదరలేదంటాడు తన తాత. జాతకాలు కుదిరితే, కట్నం చాలదంటాడు తన తండ్రి. ఇక తనకీ జన్మకు పెళ్లి కాదు అనుకున్నాడు! తనూ విసిగి వేసారి పోయాడు. చిన్నప్పటినించీ ఒద్దికగా, క్రమశిక్షణలో పెరగటంవలన, తండ్రిని ఎదిరించే ధైర్యం తనకి లేదు. మనసూ రాదు. అందుకే తన కర్మ అనుకున్నాడు! కాని ఇంతలో.....

"ఏం బాబూ, ఎక్కడికి వెడుతున్నారూ!" సావిత్రి బాబుని మరిపెంగా అడుగుతున్నది.

సారథి విననట్టుగా పేపరు చూస్తూనే తన చెవులు వాళ్లకి అప్పగించాడు.

"బెజవాల" అన్నాడు బాబు తల వంచుకుని.

'ఏమిటి, ఆమెని సూటిగా చూడటానికి వీడు కూడా సిగ్గుపడుతున్నాడు' అనుకున్నాడు సారథి.

"మరి అమ్మ రావటంలేదా?" అన్నది సావిత్రి లాలింపుగా.

"అమ్మ దగ్గలకే వెలుతున్నాంగా!" అమాయికంగా అన్నాడు బాబు.

సారథికి అదోలా అనిపించింది. 'ఆరా తీస్తున్నది, గురూ! ఇక మనమీద పడబోతున్నది!' అనుకున్నాడు.

ట్రెయిన్ ఏవో స్టేషన్లలో ఆగుతున్నది, తిరిగి బయలుదేరుతున్నది. సారథి ఆలోచనలు మాత్రం సాఫీగా అతన్ని ముసురుకుంటూనే ఉన్నాయి! ఆమె తనని సూటిగా అడిగేలానే ఉంది, ఆ వాలకం చూస్తే. తనెలా సిద్ధపడాలి! తనని శుద్ధ సంస్కారం లేనివాడిగా చిత్రించుకుని ఉంటుంది. ఛ.... ఏమిటిది? ఇంత ఇబ్బందిగా ఉంది వ్యవహారం అనుకున్నాడు.

"నీ కెన్నేళ్లు, బాబూ!" అన్నది సావిత్రి ఈసారి. ఆమె ఆప్యాయంగా అలా అడుగుతుంటే, బాబుకీ సరదాగానే ఉంది.

అందమైన ఆమె పెదవులు మెరుపు తీగల్లా మెరుస్తుంటే, సారథి ఆమె ముఖంలోకి చూడలేకపోతున్నాడు.

"నాకా... మూడో ఏడు" అన్నాడు బాబు.

ఆమె సన్నగా నవ్వింది.

ఏదో కవ్వింపు కనపడింది సారథికి ఆ నవ్వులో.

"మా నానిగాడికి నాలుగో ఏడు!" అన్నది సావిత్రి గర్వంగా.

ఆమె ఆ మాట ఎవర్ని ఉద్దేశించి అన్నదో బాబుకి తెలీదు. అందుకే వాడూ సరదాగా నవ్వాడు. సారథికి ఏమిటో కసిగా ఉంది. ఆమె కాస్సేపు మాట్లాడకుండా ఊరుకుంటే బావుండుననుకున్నాడు. ఒకసారి భారంగా అటూ ఇటూ కదిలి, పేపరులో ముఖం దూర్చాడు.

సావిత్రికి తెలుసు అతను పేపరు చదవటం లేదనీ, తమ మాటలు వింటున్నాడనీ.

"మా బేబీకి ఇంకా సంవత్సరం దాటలేదు. మా బేబీ బాగుందా, బాబూ!" అన్నది, క్రీగంటితో సారథిని చూస్తూ.

బాబు సిగ్గు పడ్డాడు. తల వంచుకుని "బాంది!" అన్నాడు.

సారథికి విసుగేసింది. 'వేలెడు లేడు వెధవ, వీడికి సిగ్గేమిటి?' అనుకున్నాడు.

ఇంతలో మంగళగిరి స్టేషన్ వచ్చింది. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. దిగేవాళ్లు దిగుతున్నారు. ఈ కంపార్టుమెంటులో ఒక లావాటావిడ మాత్రం ఎక్కింది. ముసలతను గురక పెడుతున్నాడు.

"అమ్మా, బిస్కట్లే!" అంటున్నాడు నానీ.

"ఇప్పుడు వద్దు!" విసుక్కున్నది సావిత్రి.

"అః.....ఆ.... ఇస్పులే కావాలే...." ఏడుపు లంకించుకున్నాడు నానీ.

"సరే, ఏడవకు! కొనిస్తా".

వెంటనే బిస్కెట్లవాడిని పిలిచింది సావిత్రి.

ఎప్పుడూ కిందపడి దొర్లి ఏడిస్తేనేకాని ఏమీ కొనివ్వని అమ్మ వెంటనే కొనటం నానీకి విచిత్రంగానే ఉంది. అయినా అమ్మ బిస్కెట్లు కొంటున్నది. వాడికదే చాలు.

సావిత్రి మనసు ఆమె స్వాధీనంలో లేదు! ఆమె ఉద్దేశం మాత్రం ఒకటే - సారథి తననీ, తన సంసారాన్నీ చూసి ఈర్ష్యపడాలి. తనని కాదన్నందుకు బాధపడాలి. 'ఎంత సుఖంగా, ముచ్చటగా కాపరం చేసుకుంటున్నది!' అని అసూయ చెందాలి. ప్రస్తుతానికి ఆమె ఆలోచనలు అంతే!

నానిగాడి ముందో నాలుగు బిస్కెట్లు పోసి, ఇంకో నాలుగు బిస్కెట్లు బాబు చేతిలో ఉంచింది సావిత్రి.

అది చూసి సారథి చటుక్కున పర్సు తీసి, రూపాయి నోటు అందించాడు బిస్కెట్ల

వాడికి. సావిత్రి గుర్రుగా చూసింది సారథిని.

"ఏయ్, అబ్బీ! అది తీసుకోవద్దు! ఆయనకి తిరిగి ఇచ్చెయ్! ఇది తీసుకో!" తనే డబ్బులు ఇచ్చింది సావిత్రి. బిస్కెట్ల వాడు సారథి చేతిలో రూపాయి ఉంచి, వెళ్లిపోయాడు.

సావిత్రి ఏదో విజయగర్వంతో చూసింది తన వేపు.

తనని ఎందుకో దెప్పుతున్నట్టుగా ఉన్నదా చూపు.

సారథి తనలో తనే సణుక్కున్నాడు. బాబుకేసి చూశాడు.

వాడు ఆప్యాయంగా బిస్కెట్లు తింటున్నాడు.

సారథి మళ్లీ సణుక్కున్నాడు.

ట్రెయిన్ బయలుదేరింది, టకటకా మోత చేసుకుంటూ.

సావిత్రి పక్కనే ఉన్న లావాటావిడతో అంటున్నది: - "మా వారు ఇంజనీరు గుడివాడలో. బాగానే సంపాదిస్తున్నారు. ఆరొందలపైనే వస్తుంది నెలకి!"

సావిత్రి మాటలు విని ఆవిడ సారథి వేపు ఆప్యాయంగా చూసింది. సారథి ఉలిక్కిపడ్డాడు.

"ఆయన చాలా బావుంటారు కూడానూ. కావాలనే చేసుకున్నాను. ఇప్పుడు గుడివాడలోనే ఉంటున్నారు. బహుశా స్టేషన్‌కి వస్తారు, నన్ను ఇంటికి తీసుకువెళ్లటానికి!"

ఆమె క్రీగంటితో తనని కవ్విస్తున్నదని తెలుసు సారథికి. కాని ఏమీ ఎరగనివాడిలా కిటికీలోనించి బయటకు చూస్తున్నాడు.

లావాటావిడ విచిత్రంగా చూసింది. తరువాత నానిగాడితో ఏవో మాటల్లో పడిపోయింది.

"ఒరేయ్, సారథీ, బెజవాడ వచ్చిందా?" అన్నాడు మూర్తి పై బెర్త్ మీదనించి.

"లేదు. నువ్వు పడుకో! వచ్చింతరవాత నేను లేపుతాలే!"

"ఏం నిద్రరా? నిద్రాదేవి నా దగ్గిరికి రావటానికి భయపడుతున్నది!" అంటూనే కళ్లు మూసుకుని, శరీరం ముడుచుకున్నాడు మూర్తి.

కిటికీలోనించి బయటకు చూస్తున్న సావిత్రిని పరిశీలనగా చూశాడు సారథి. ఆమెకు అతను చూస్తున్నాడని తెలిసినా, అతను తనని చూడాలనే కోరికగా ఉంది. చూసి, చూసి, తనకి దక్కలేదనే అసూయతో దహించుకుపోవాలనే అభిప్రాయం కూడా ఉంది. అందుకే కదలక మెదలక కిటికీలోనించి బయటకు చూస్తున్నది.

"సావిత్రిని చేసుకున్నావాడెవడో అదృష్టవంతుడు!" అనుకున్నాడు సారథి.

కాని ఆ అదృష్టవంతుడి, అదృష్టానికి ఈర్ష్య పడలేదు. చింతించలేదు. ఆమెను చూడగానే అలా అనుకున్నాడు. అంతే!.

స్త్రీకి పసితనం నుంచీ యౌవనం దాకా శారీరకంగానూ, మానసికంగానూ ఎంత త్వరితమైన మార్పు వస్తుందో, పెళ్లికాకముందునించీ, పెళ్లయి పిల్లల తల్లి అయిన తరువాత దాకా శారీరకంగానూ, మానసికంగానూ అంతకన్నా ఎక్కువే మార్పు వస్తుంది. చూపుల్లో సిగ్గు, నదురు బెదురు మాయమయి, ఏదో బెదిరింపు, నిర్లక్ష్యం, గర్వం, హుందాతనం, ఆప్యాయత వస్తాయి. సావిత్రి చూపుల్లో అవి కొంచెం  ఎక్కువగానే కనపడ్డాయి సారథికి.

ఉన్నట్టుండి సావిత్రి బాబుని అడిగింది, "నీ పేరేమిటి?" అని.

"బాబు" అన్నాడు వాడు గడుసుగా.

సావిత్రి గలగలా నవ్వి, "మరి మీ అమ్మ పేరేమిటి, బాబూ?" అన్నది.

బాబు కళ్ళెత్తి "అమ్మ!" అన్నాడు, బిస్కెట్టు కొరుకుతూ.

ఆమెకి పేరు తెలుసుకోలేనందుకు చాలా చిన్నతనంగా ఉంది. ముఖం అదో రకంగా పెట్టింది.

సారథి తనలో తనే చిన్నగా నవ్వుకున్నాడు. ఆమె సారథి ముసిముసి నవ్వులు గమనించింది.

"వాళ్ళమ్మ పేరు ఏమిటండీ!" అన్నది సారథిని సూటిగా చూస్తూ.

"ఆఁ!.....ఆఁ!......ఏమిటి?" గాభరాగా అన్నాడు సారథి.

ఆమె గమ్మత్తుగా నవ్వింది. ఆ నవ్వు సారథి గుండెల్లో మంటలు రేపింది.

మళ్లీ అడిగిందామె.

"భారతి అనుకుంటాను!" అన్నాడు సారథి నెమ్మదిగా.

ఆమె మళ్లీ నవ్వింది, ఇంకా ఏమనుకుంటారు అన్నట్టుగా.

సారథికి చటుక్కున ఏదో అర్థమయినట్టయింది. ఆవిడ ఉద్దేశ్యం గ్రహించాడు. తనలో తనే బాధపడ్డాడు. ఆమెకా ఉద్దేశ్యం అసలు రానేకూడదు అనుకున్నాడు.

ఆమె అదోరకంగా తననే చూస్తున్నది.

తల పైకెత్తి చూశాడు. మూర్తి కదలక, మెదలక, అలానే పడుకొని ఉన్నాడు.

"ఆమె బావుంటారా?" అడిగింది సావిత్రి.

"ఎవరు?"

ఆమె జవాబు చెప్పక చిన్న మందహాసం చేసింది, ఏదో అర్థం స్ఫురించేటట్లుగా.

సారథికి ముందు విసుగు కలిగినా, తరవాత ఏదో సరదా వేసింది. 'అంతే... అదే మంచి మార్గం' అనుకున్నాడు.

లావాటావిడ నిద్రకి తూగుతున్నది.

"ఆఁ చాలా బావుంటుంది!"

"చాలా అంటే....." మళ్లీ నవ్వింది సావిత్రి.

"మీకన్నాకూడా!" సూటిగా సావిత్రి ముఖంలోకి చూశాడీసారి.

"కట్నం ఎంత తీసుకున్నారు?" కసిగా అడిగింది సావిత్రి.

"చాలా...." అన్నాడు సారథి, తనలోని నవ్వుని అదుపులోకి తెచ్చుకుని.

ఈసారి ఆమె, "చాలా అంటే...." అని అడగలేదు.

ఒడిలో పడుకున్న పసిపిల్లని దబదబా చిచ్చి కొడుతూ కిటికీలోనించి బయటకు చూస్తున్నది సావిత్రి.

సారథికి ఏమిటో ఆనందంగా ఉంది. సావిత్రి ఎర్రబారిన ముఖంలోకి విజయగర్వంతో చూడాలనుకున్నాడు.

ఇంతలో బాబు ఒకటికి పోవాలన్నాడు.

సారథి సణుక్కున్నాడు. బాబు ముఖం చూస్తే, క్షణం ఆలస్యం చేస్తే, అక్కడే పూర్తి చేసేటట్టున్నాడు. ఇబ్బందిగా లేచి, సారథి బాబుని తీసుకుని లేవెటరీవేపు దారి తీశాడు.

సారథి బాబు పని పూర్తి అయిన తరవాత, తన సీట్లోకి వచ్చేసరికి ట్రెయిన్ బెజవాడ ప్లాట్‌ఫారమ్ మీద ఆగబోతున్నది.

మూర్తి పై బెర్త్ మీదనించి కిందకి ఎప్పుడు దిగాడో కాని, పెట్టె తీసి, దాంట్లో దుప్పటీ ఉంచేసి, పెట్టెకి తాళం వేసి సిద్ధంగా ఉన్నాడు.

ట్రెయిన్ దిగుతుండగా మూర్తి అన్నాడు: "మీ ఎదురుగా కూర్చున్నావిడ ఎవరో తెలుసా? నా ఫ్రెండ్ భాస్కర్ అని చెప్పానే -- గుడివాడలో ఇంజనీర్ అని -- ఆయన భార్య. ఆవిడేమనుకుం టున్నదో తెలుసా? ఈ బాబు నీ కొడుకనుకుంటున్నది. అదే విషయం నాతో అన్నది కూడాను!"

బిత్తరపోయాడు సారథి.

"నువ్వేమన్నావ్?" గాభరాగా అడిగాడు సారథి.

"ఏమంటాను? వీడు నా సుపుత్రుడు. అతని పిల్లవాడు కాదు. అతను నా క్లోజ్ ఫ్రెండ్. అసలు వాడికి పెళ్లి కాలేదు. ఈ జన్మలో కాదు కూడానూ అని నిజం చెప్పేశాను!" అన్నాడు మూర్తి బాబుని కిందికి దించుతూ.

నాలుగు పక్కలా బాంబులు పేలినట్లయింది సారథికి.

ఆమె దృష్టిలో ఎంత చులకనయిపోయాడు తను! ఛీ! 'ఆమె తనను చూసి ఏహ్యంగా నవ్వుతుందో ఏమో!' అనుకున్నాడు.

అనుకున్నవాడు ట్రెయిన్ దిగి వెడుతున్నప్పుడు ఆమె కేసి మరోసారి చూడకుండా ఉండలేకపోయాడు.

ఆమె తనని అదోలా చూస్తున్నది. ఆ చూపులో ఈ సారి ఆ కవ్వింపూ, బెదిరింపూ లేవు. తనని జాలిగా చూస్తున్నది. సానుభూతి అందిస్తూందా?

సారథి అక్కడ మరో క్షణం ఆగలేకపోయాడు. వేగంగా ముందుకు అడుగులు వేశాడు.●

*(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక: అక్టోబర్ 15, 1969)*